కథా నిలయం
3847
శ్రీకాకుళం



# కథారంభం

హైవే సిక్స్ మీద కారులో అరవై మైళ్ల స్పీడుతో వెడుతున్న విక్రమరావ్ ఉలిక్కిపడ్డాడు. తన భుజం మీద ఎవరిదో చేయి పడటం చూసి.

చటుక్కున వెనక్కి తిరిగి చూశాడు.

అతను నవ్వుతూ "హాయ్!" అన్నాడు.

కారు నాలుగు తలుపులూ గట్టిగా వేసి, తాళం వేసి, తనొక్కడే బయలుదేరాడు. మరి ఇతను కారులోకి ఎలా వచ్చినట్లు? ఎప్పుడు వచ్చినట్లు? వళ్ళు గగుర్పొడిచింది విక్రమరావ్‌కి.

అతి ప్రయత్నం మీద నోట్లోంచి మాట బయటికి వచ్చింది.

"హు ఆర్ యు?" అడిగాడు.

"నేనా?" స్వచ్ఛమైన తెలుగులో అన్నాడతను పెద్దగా నవ్వి. "నా పేరు అమెరికా బేతాళుడు!" మళ్ళీ నవ్వాడతను.

బిత్తరపోవటం కాసేపు ఆపి, వెనక్కి తిరిగి దీక్షగా చూశాడతన్ని. ఎర్రగా రాగి జుట్టుతో అమెరికా వాడిలానే ఉన్నాడు కానీ, బేతాళుడి పోలికలు కనపడలేదు. ఎందుకంటే బేతాళుడు ఎలా ఉంటాడో ఇండియాలో ఎప్పుడూ చూడలేదు విక్రమరావ్. ఒకవేళ చూసినా అమెరికా బేతాళుడు, ఇండియా బేతాళుడిలా ఉండవలసిన అవసరం లేదు.

"ఏమిటి? అలా చూస్తున్నావ్?" అడిగాడు బేతాళుడు.

"అహహ! ఏంలేదు!"

"హాలవీన్ వేషం (హాలవీన్ అంటే అమెరికాలో 'దయ్యాల దినం')లో నేను లేను అనా!" మళ్ళీ నవ్వాడు.

కారు హైవే సిక్స్ మీద నుంచి - హైవే టెన్‌లోకి తిప్పాడు విక్రమరావ్. హైవే ఎక్కిన తర్వాత అన్నాడు - "గంటకి వంద కారులు పైన వెడుతుంటాయి, ఈ రోడ్డు మీద. నీకు రెయిడ్ కావాలంటే నా కారే దొరికిందా? అసలు నీకింతకీ ఏం కావాలి?"

"చెబుతాను - తీరిగ్గా చెబుతాను. ఒక సిగరెట్టు యియ్యి" అన్నాడు బేతాళుడు.

"నేను సిగరెట్టు తాగను. బీరూ, బ్రాందీ లాంటి మందులు తప్ప నేను వేరే ఏమీ తాగను!" అన్నాడు విక్రమరావ్.

"నువ్వెక్కడి పత్యం మనిషివి దొరికావయ్యా నాకు!" సణగటం అయిన తర్వాత అన్నాడు బేతాళుడు.

"అమెరికాలో దేనికీ ఆలస్యం పనికిరాదు - నేను నీ కారెక్కిన వైనం చెబుతాను - నన్ను కూడా ముందు సీట్లోకి రానీ!" అంటూనే వెనుక సీట్లో మాయం అయి, ముందు సీట్లో ప్రత్యక్షం అయ్యాడు బేతాళుడు.

విక్రమరావ్ బేతాళుడి కాళ్ళు పరికించి చూశాడు. పాదాలు, వాటికి వేసిన బూట్లు వెనక్కి తిరిగి వున్నాయి.

"నేను బేతాళుడినని నీకు యిప్పటికి నమ్మకం కుదిరిందన్న మాట?" అన్నాడు.

"ఇందాక నువ్వు స్వచ్ఛమైన తెలుగు మాట్లాడినప్పుడే నమ్మకం కుదిరింది. ఇక్కడి తెలుగువాళ్ళే తెలుగులో మాట్లాడటం మర్చిపోతుంటే, అమెరికా వాడు తెలుగు మాట్లాడట మేమిటి - ఇదేదో దయ్యాల పని కాకపోతేను,అని ఇందాకే అనుకున్నాను. నేను అనుకున్నది నిజమా? కాదా? అని నీ కాళ్ళు పరీక్షించాను. అంతే -" విక్రమరావ్‌కి చాలా ధైర్యం వచ్చేసింది. అందుకే చాలా ఫ్రీగా మాట్లాడేస్తున్నాడు.

"సరే విను - నా సంగతి చెబుతాను. పూర్వం విక్రమాదిత్యుడు ఇండియాలో రాజ్యం చేస్తున్నప్పుడు, నేను బేతాళుడి వేషం కట్టాను. ఈ జన్మలో, ఇప్పుడు ఈ హూస్టన్ నగరంలో పనిచేస్తున్నాను. పూర్వం ఇండియాలో అనుభవం వున్నది కనుక, అదేరకమయిన పని దొరికింది నాకు. పని దొరికింది కానీ, ఇన్నాళ్ళదాకా విక్రమార్కుడు దొరకలేదు. చివరకు నా అదృష్టం కొద్దీ నువ్వు దొరికావు!"

"నా పేరు విక్రమార్కుడు కాదు - విక్రమరావ్!"

"అదేలేవోయ్ చెవలాయ్! ఇండియా వాళ్ళు అమెరికా రాగానే పేర్లు మారిపోతాయి. కల్యాణ సుందరం కేల్‌గానూ, రామసుబ్రమణ్యం రేమ్‌గాను మారిపోవటం లేదూ - అలాగే! సరే అసలు పాయింటుకి వద్దాం. నువ్వు రోజూ ఇలాగే వెడతావు కదా ఇంటికి. నువ్వు హైవే సిక్స్ మీదకు రాగానే నీ కారు ఎక్కుతాను. మన చుట్టూ జరిగే విషయాల మీద హస్కు వేసుకొందాం. చివరిలో నేను కొన్ని ప్రశ్నలడుగుతాను. వాటికి జవాబు చెబితే, వెంటనే నేను నీ కారు వదిలేసి స్థానిక టెలివిజన్ కేంద్రంవారి హెలికాప్టర్, ట్రాఫిక్ రిపోర్ట్ కోసం ఇక్కడే పైన తిరుగుతుంటుందిలే .... దాంట్లో ఎక్కి వెనక్కి వెళ్ళిపోతాను. నువ్వు జవాబు



తెలిసీ, చెప్పకపోతే, నీ బుర్ర వేయి చెక్కలయిపోవద్దులే - నీ బుర్ర పోయిందంటే నాకింకో విక్రమార్కుడు దొరక్క, ఈ ఉద్యోగం పోతుంది .... నీ కారు టైర్లు ఢామ్మంటాయి.. అర్ధరాత్రిదాకా ఈ రోడ్డునపడి, ఇబ్బంది పడాల్సివస్తుంది. అందుకని నీ బుర్ర ఉపయోగించి నా ప్రశ్నలకు జవాబులు చెబుతూ వుండు - సరేనా!''

'సరే' అనక తప్పలేదు విక్రమరావ్‌కి. రోజూ ఇంటికి వెళ్ళేటప్పుడు రేడియోలో రాక్ మ్యూజిక్ వినలేక చస్తున్నాడు. ఈబేతాళుడు వుంటే కాస్త కాలక్షేపంగా వుంటాడులే అని అనుకున్నాడు. కారు డిక్కీలో ఒకటి కాదు రెండు టైర్లు స్పేరుగా ఉన్నాయి - ఏం ఫరవాలేదులే అని కూడా అనుకున్నాడు.

"సరే తొందరగా కానీ - ఇవాల్టి కథ!'' అన్నాడు విక్రమరావ్.

గొంతు సవరించుకుని ప్రారంభించాడు అమెరికా బేతాళుడు.

"పోయిన శనివారం సాయంత్రం తీరిగ్గా టి.వి. చూస్తూ కూర్చున్నాను. "హి-హ" ప్రోగ్రాం బోరు కొట్టేసింది. ఏం చేయాలా అని తిరుగుతుంటే, సుబ్బారావుగారి ఇల్లు కనబడింది. లోపలకు తొంగిచూస్తే సుబ్బారావుగారు మంచం మీద పడుకుని వున్నాడు. ఆయన శరీరం అక్కడే వుంది కానీ, ఆత్మ మాత్రం అక్కడ లేదు. వాళ్ళావిడతోపాటు భారతదేశం పోయింది. పోయి విజయవాడ దుర్గాభవన్‌లో ఉప్మా, పెసరట్టు తింటున్నది. ఈలోగా ఫోన్ మోగింది.

సరే కాసేపు కాలక్షేపం అవుతుందని, సుబ్బారావు శరీరంలోకి దూరి, ఫోన్ తీశాను. అప్పారావు పిలుస్తున్నాడు - "ఏం మహానుభావా! ఆరు గంటలకే యిక్కడకు వస్తానని ఇప్పటిదాకా రాలేదు - నిద్రపోతున్నావా? తొందరగా బయల్దేరు - అందరూ వచ్చేశారు!" అని టక్కున ఫోన్ పెట్టేశాడు.

"సరే పెద్దమనిషి పిలిచి భోజనం పెడతానంటున్నాడు - మోకాలు అడ్డం పెట్టడం ఎందుకని - సుబ్బారావు రూపంలో అప్పారావు ఇంటికి వెళ్ళాను!"

విక్రమరావ్‌కి ఆరు పెగ్గుల బ్రాందీ, సోడా కలుపుకోకుండా గడగడా తాగినంత నిషా వచ్చేసింది. ఏమిటో ఈ పరకాయ ప్రవేశాలూ - అవీ - ఏవో కాశీ మజిలీ కథల్లో చదవటమేకాని ఎప్పుడూ చూడలేదు ప్రత్యక్షంగా - సరే నిండా మునిగినవాడికి చలేమిటి అని వింటూ కూర్చున్నాడు.

అప్పారావు ఇంటికి వెళ్ళేసరికి చిదంబరం, ప్రసాద్, రాజారావ్, కొండలరావ్ అందరూ మంచి వాగ్యుద్ధంలో వున్నారు!

"అమెరికా యుద్ధప్రియ దేశం అంటే వార్ లవర్ అన్నమాట. న్యూక్లియర్ బాంబులు చేతిలో పట్టుకుని ప్రపంచ శాంతిని కాపాడతానంటే ఎవరు నమ్ముతారు చెప్పండి. లెబనాన్‌లో యుద్ధం చేస్తూ, జనాన్ని చంపుతూ, "పీస్ కీపింగ్ ఫోర్స్" శాంతి నెలకొల్పుతున్నది. గ్రెనెడా లాటి చిన్న దేశంమీద దాడిచేసి హాస్పిటల్ మీద బాంబులు వేసి శాంతిని నెలకొల్పు తున్నది". అనర్గళంగా ఉపన్యాస ధోరణిలో అంటున్నాడు ప్రసాద్. మాస్కో లుముంబా యూనివర్శిటీలో డాక్టరేట్ చేసి, ఇండియాలో పదేళ్ళు పనిచేసి, రెండేళ్ళ క్రితం ఈ దేశం వచ్చాడు ప్రసాద్.

"మీరేం తీసుకుంటారు?" అడిగాడు అప్పారావు నన్ను.

ఉప్పు, నిమ్మకాయ కలిపిన మజ్జిగ అని అనబోతున్న సుబ్బారావ్ శరీరాన్ని నోరు మూయించి, "స్కాచ్ వుంటే ఇవ్వండి!" అన్నాను.

"ప్రసాద్‌గారూ - మీరు ఈ దేశంలో ఉంటూ వీళ్ళ ఛీస్ తింటూ వీళ్ళనే తిట్టడం బాగాలేదు. ఇక్కడ ముఖ్యంగా మనం గమనించవలసిన దేమిటంటే, రష్యా ప్రపంచమంతా కమ్యూనిజంతో నింపేద్దామని చూస్తున్నది. ఆ కమ్యూనిస్టుల్ని ఆపాలంటే, ఒక్క అమెరికాకే సాధ్యం. అందుకే వీళ్ళను మనం సపోర్టు చేయాలి" ఒక్క నిమిషం చెప్పటం ఆపి, బల్ల మీద వున్న ప్లేట్లోంచి ఒక సమోసా తీసి, నోట్లో వేసుకున్నాడు చిదంబరం.

కొంచెం కూడా బీరు పోకుండా గ్లాసులో బీరు అంతా తాగి - గ్లాసు బల్ల మీద పెట్టి ప్రసాద్ అన్నాడు - "మాష్టారూ రష్యా కమ్యూనిజాన్ని ప్రపంచం మీద రుద్దుదామను కుంటుందన్నారు మీరు. ఓ.కే. మాటవరసకి టెంపరరీగా ఒప్పుకుందాం. మరి అమెరికా ఏం చేస్తున్నదంటారు? కాపిటలిజాన్నే ప్రపంచం మీద రుద్దుతున్నది. ప్రతి కాంటినెంటులోనూ కొన్ని దేశాల్ని తన చేతిలో పెట్టుకుందామని చూస్తున్నది. ఆనాటి హిట్లర్ జర్మనీకి, ఈనాటి

అమెరికాకీ తేడా ఏమిటి చెప్పండి!"

రాజారావు లేచి వెళ్ళి తన గ్లాసు నిండా నింపుకుని వచ్చి వింటూ కూర్చున్నాడు.

కొండలరావ్ ఆలోచిస్తున్నాడు - రష్యా అమెరికాల గురించి కాదు, ఆఫీసులో బాస్ ఇవాళ అంతమాట అన్నాడే వాణ్ని రేపు ఏం చెయాలా అని. ఆలోచిస్తూనే, ఉప్పు వేసిన జీడిపప్పు తింటూ వింటున్నట్టు నటిస్తూ కూర్చున్నాడు.

"మీరు కాపిటలిజం అన్నారే, దాన్ని ఈ దేశంలో ఫ్రీడం అంటారు. మన మనసులో ఉన్నమాట ధైర్యంగా పైకి చెప్పవచ్చు ఈ దేశంలో. అక్కడ నోరు విప్పతే నోటినీ, మనిషినీ కూడా మూసేస్తారు కదండీ. మనిషికి తిండీ, బట్టా లేకపోయినా ఫరవాలేదు కానీ స్వతంత్రం లేకపోతే మాత్రం బతకటం అనవసరం అన్నాడు కదండీ - అబ్రహం లింకనా, ఎడ్గార్ అలెన్ పోనా! ఎవరూ అన్నది?" చిదంబరం అమెరికాలో ఇంజనీరింగ్ చదివాడు.

పెద్దగా నవ్వాడు ప్రసాద్ - "లింకనూ కాదు, షేక్స్పియరూ కాదు. జేమ్స్‌బాండ్ అన్నాడు. ఎవడయితే ఏమండీ - బయాస్డ్ అభిప్రాయాలు వున్నవాళ్ళు అలాగే అంటారు. అందరూ అన్నారని అనుకుంటారు. కానీ అసలు నిజం ఏమిటో తెలుసా? జపాన్‌వాడు ప్రపంచంలో దాదాపు అన్ని రంగాల్లోనూ ప్రథమ స్థానంలో వున్నాడు. ఎలక్ట్రానిక్స్, స్టీల్ షిప్పింగ్, కార్లు, హెవీ ఇండస్ట్రీ, గడియారాలు, ఆప్టిక్స్ కెమెరాలు .... యూ నేమిట్! అన్నీ వాడివే. అమెరికాలో కూడా జపాన్ వస్తువులకు వున్న విలువ, గిరాకీ అమెరికా వస్తువులకు లేదు. ఎక్కడికి పోయినా సోనీ టీ.వీ., పానసోనిక్ విడియో, అక్కాయ్ స్టీరియో, టొయాటో కారు, సీకో వాచ్, కానన్ కెమెరా. అమెరికావాళ్ళకి ప్రపంచ వ్యాపార రంగంలో ఇక మిగిలింది యుద్ధ పరికరాలూ, విమానాలూ. అవి ఎంతగా అమ్మితే వీళ్ళ ఆర్థిక పరిస్థితి అంత బాగుంటుంది. ప్రపంచమంతా శాంతి వుంటే అమెరికా ఆర్థికంగా దెబ్బతింటుంది. అందుకే ఇండియా మీదకు పాకిస్తాన్నీ, లెబనాన్ మీదకి ఇజ్రాయిల్నీ - వీడి పిలక వాడికీ, వాడి పిలక వీడికీ ముడివేయటం. యుద్ధ పరికరాలు అమ్ముకోవటం. జపాన్ వాడిది కన్స్యూమర్ ఓరియెంటెడ్ ఎకానమీ, అమెరికా వాడిది వార్ ఓరియెంటెడ్ ఎకానమీ" - ప్రసాద్ అలసిపోయి ఒక్క క్షణం ఆగాడు.

కొండలరావు, వచ్చే లాంగ్ వీకెండ్‌కి ఏ వూరు వెడదామా అని ఆలోచిస్తూ, ప్రసాద్ తనవేపు చూడటం గమనించి వింటున్నట్టు మర్యాదగా తల వూపి, వినకుండా ఆలోచిస్తూ కూర్చున్నాడు.

రాజారావు లేచి వెళ్ళి గ్లాసునిండా మళ్ళీ "సోమరసం" పోసుకుని, వస్తూ వస్తూ గుప్పెడు జీడిపప్పు తెచ్చుకుని తింటూ కూర్చున్నాడు.

"మీరు చెప్పిన వాటిల్లో చాలావరకు నిజాలు కాదు. అమెరికాలో వున్న హై టెక్నాలజీ జపాన్‌లో ఎక్కడ ఉందీ - కంప్యూటర్స్‌లో అమెరికా ...."

అప్పారావు భార్య అలివేలు వచ్చింది "ఇక భోజనాలు చేద్దామా" అని. ప్రతివారం వినే భాగోతం మళ్ళీ వినటానికి ఇష్టంలేక ప్రక్క గదిలోకి వెళ్ళిపోయింది. అక్కడ ఇండియన్

శారీ పాలస్‌లో కొత్తగా వచ్చిన "జపాన్" చీరల గురించి కూలంకషంగా శిఖరాగ్ర చర్చల రామాయణం జరుగుతోంది మరి.

అప్పారావు భార్య గీచిన గీత దాటకుండా జాగ్రత్తగా నుంచుని, "రండి సార్ భోం చేద్దాం!" అన్నాడు.

కొండలరావు, సుబ్బారావు రూపంలో వున్న నాతో అన్నాడు.

"సుబ్బారావుగారూ - మీరు చెప్పండి అమెరికా గొప్పతనాన్ని చాటే చిదంబరంతో మీరు ఏకీభవిస్తారా? రష్యాని పొగుడుతూ అమెరికాని తిట్టే ప్రసాద్‌తో మీరు ఏకీభవిస్తారా?"

చిదంబరం, ప్రసాద్ ఇద్దరూ నా వైపే చేస్తున్నారు, నేనేం చెబుతానా అని.

నేను జవాబు ఏం చెబుదామా అని, ఆలోచన ప్రారంభించబోయేసరికి రాజారావు లేస్తూ అన్నాడు - "తీరిగ్గా ఆలోచిస్తుంటే అక్కడ పూరీలు అయిపోతాయి. ముందు తిందాం రండి. తర్వాత చూద్దాం అమెరికా, రష్యా రాజకీయాలు" అని డైనింగ్ టేబుల్ కేసి నడిచాడు." కథ చెప్పటం ఆపాడు బేతాళుడు. విక్రమరావ్ కారు స్టాప్ సిగ్నల్ దగ్గర ఆపటం చూసి.

"ఓ - అప్పుడే మీ ఇంటి దగ్గరకు వచ్చేస్తున్నామే - సరేమరి నా ప్రశ్నకు జవాబు చెప్పు - నా పరిస్థితిలో నువ్వే ఉంటే ఎవరితో ఏకీభవిస్తావు? తెలిసీ జవాబు చెప్పక పోతే ...."

విక్రమరావ్ అందుకొని అన్నాడు - "మరీ అలా రావుగోపాలరావులాగా బెదిరించకు. నాకు జవాబు తెలుసు. నాకు తెలుసునని నీకు తెలుసునని కూడా నాకు తెలుసు. నేను చిదంబరంతోనూ ఏకీభవించను, ప్రసాద్‌తోనూ ఏకీభవించను. రాజారావుతో ఏకీభవిస్తాను. రాజారావు వచ్చింది పార్టీకి. సుబ్బరంగా కడుపునిండా తాగాడు, సుష్టుగా తిన్నాడు. రష్యా, అమెరికాల జోలికి పోకుండా పూరీలు, బాదం హల్వాల గురించి ఆలోచించాడు. అదే ప్రాక్టికల్ అప్రోచ్ టు ...."

విక్రమరావ్ చెప్పడం పూర్తి కాకుండానే అమెరికా బేతాళుడు కారు సీటులో మాయమై "బై" అని అరుస్తూ పై కెగిరి - స్థానిక టెలివిజన్ కేంద్రంవారి ట్రాఫిక్ గురించి వార్తలు చెప్పే నిమిత్తం పైన తిరుగుతున్న హెలికాప్టర్ ఎక్కి అంతర్థానమయ్యాడు.

❖